






ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 267 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-   సోమవారం 28 ఏప్రిల్ 2025

RNI No: APTEL/2023/87888   Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepalligudem, Kadapa, Ongole


# పహల్గాం దాడి...

## ప్రధాని మోదీతో రాజ్‌నాథ్ కీలక భేటీ

**ప్రధాని మోదీతో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. పహల్గాంలో భద్రతా చర్యలను వివరించారు.**



దిల్లీ, ఏప్రిల్ 28, (రిపబ్లిక్ న్యూస్): పహల్గాం దాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దాయాదికి గుణపాఠం చెప్పేందుకు న్యూదిల్లీ సిద్ధమవుతోంది. ఈ క్రమంలోనే రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్ సోమవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో భేటీ అయ్యారు. పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. పహల్గాం దాడి నేపథ్యంలో భారత్ తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్తో రాజ్నాథ్ ఆదివారం భేటీ అయ్యారు. ఆ సమావేశంలో మన సైన్యం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను రక్షణమంత్రి నేడు ప్రధానికి వివరించారు. మోదీతో భేటీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోబాల్ కూడా పాల్గొన్నారు.

### మధ్యాహ్నం మరో కీలక భేటీ..

మరోవైపు, రక్షణ వ్యవహారాలపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కూడా సోమవారం భేటీ అయ్యే అవకాశాలు కన్పిస్తున్నాయి. పార్లమెంట్ హౌస్లో మధ్యాహ్నం 3 గంటలకు ఈ భేటీ జరగనున్నట్లు అధికారిక వర్గాల సమాచారం.

### పాక్కు తుర్కియే సైనిక విమానాలు..

ఇదిలాఉండగా.. పహల్గాం దాడితో సరిహద్దుల్లో అలజడి వాతావరణం నెలకొంది. భారత్ వైపు నుంచి దాడి ఉండొచ్చన్న అంచనాలతో పాక్ ముందస్తు చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే సరిహద్దుల్లో అదనపు బలగాలను మోహరించినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా తుర్కియేకు చెందిన పలు సీ-130 హెర్క్యులస్ విమానాలు పాక్ ల్యాండ్ అయ్యాయి. ఈ విమానాల్లో సైన్యానికి అవసరమైన కార్గోను తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.

# సిలికాన్ వ్యాలీలో కంపెనీల సీఈవోలంతా

# తెలుగోళ్లు, భారతీయులే:సీఎం చంద్రబాబు


**హైదరాబాద్‌లో 14 నెలల్లోనే గతంలో హైటెక్ సిటీ పూర్తి చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు.**

అమరావతి, ఏప్రిల్ 28, (రిపబ్లిక్ న్యూస్): హైదరాబాద్లో 14 నెలల్లోనే గతంలో హైటెక్ సిటీ పూర్తి చేసినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. భవిష్యత్ అంతా ఐటీదేనని అప్పట్లో తల్లిదండ్రులకు పిలుపునిచ్చామని చెప్పారు. స్టార్టప్ కంపెనీల కోసం వి-లాంచ్ పాడ్ 2025ని చంద్రబాబు ఆవిష్కరించారు. అమరావతిలోని విట్ వర్సిటీలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. “ అప్పట్లో ఐటీని ప్రమోట్ చేశా.. ఇప్పుడు క్వాంటమ్ టెక్నాలజీని ప్రమోట్ చేస్తున్నా. ఒకప్పుడు ప్రభుత్వ అటెండర్ ఉద్యోగానికి కూడా డిమాండ్ ఉండేది. ఇప్పుడు కలెక్టర్ పోస్టు కంటే ఐటీ ఉద్యోగానికే డిమాండ్ ఎక్కువగా ఉంది.



అమరావతిలో 5 లక్షల మంది విద్యార్థులు చదవాలి

విట్ అమరావతిలో 95 శాతం ప్లేస్మెంట్లు వస్తున్నాయి. మీరు ఉద్యోగంలో సంతృప్తి చెందవద్దు.. కొత్త సంస్థలు స్థాపించండి. సిలికాన్ వ్యాలీలో కంపెనీల సీఈవోలంతా తెలుగోళ్లు, భారతీయులే. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు ఉంటారు. అందులో అగ్రస్థానంలో తెలుగువారు ఉంటారు.త్వరలో అమరావతిలో రతన్టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నాం. మన పిల్లలు ప్రపంచస్థాయి సేవలు అందించే స్థాయికి ఎదగాలి. వాట్సప్ సేవ ద్వారా ప్రజలకు పరిపాలన, ప్రభుత్వ సర్వీసులు దగ్గర చేశాం. వాట్సప్ ద్వారా వెయ్యి రకాల సేవలు అందిస్తున్నాం. స్వర్ణాంధ్రప్రదేశ్ 2047కి మార్గసూచి రూపొందిస్తున్నాం. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదిగింది. త్వరలోనే అగ్రగామిగా నిలబడుతుంది. ఉగ్రవాదులు భారత్ను ఏమీ చేయలేవు. వారికి తగిన బుద్ధి చెబుతాం. సంఘటితంగా ఉండి దేశాన్ని రక్షించుకునే శక్తి మనకుంది. డ్రోన్ సేవలను అందుబాటులోకి తెస్తున్నాం. ప్రభుత్వ సేవలను ఒకే తాటిమీదకి తెస్తున్నాం. రియల్ టైం డేటాతో సమస్యలకు రియల్ టైం పరిష్కారాలు చూపిస్తున్నాం. పీ4 ద్వారా పేదరికం లేని సమాజం కోసం కృషి చేస్తున్నాం. 20శాతం సంపన్నులు 20శాతం పేదవారిని పైకి తీసుకురావాలి. ఒకప్పుడు జన్మభూమి కోసం చాలా మంది అలా పని చేశారు. ఇప్పుడు మార్గదర్శి, బంగారు కుటుంబం కోసం కలిసి రావాలి. కొత్తగా ఆలోచించడం ద్వారా యువత విజయం సాధించాలి. ఏపీని ఇన్నోవేషన్ వ్యాలీగా తయారు చేయాలి. అమరావతిలో 5 లక్షల మంది విద్యార్థులు చదవాలి. విట్లో 50 వేల మంది విద్యార్థులు ఉండాలి. కేవలం ఏపీ విద్యార్థులే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల విద్యార్థులు ఉండాలి. అమరావతిలో 30శాతం పచ్చదనం, నీరుతో నిండి ఉంటుంది. ఇప్పుడున్న వర్సిటీలతోపాటు మరికొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థలు వస్తున్నాయి. మే 2న ప్రధానమంత్రి మోదీ అమరావతికి వస్తున్నారు. ప్రధాని చేతుల మీదుగా అమరావతి పునఃప్రారంభం కాబోతోంది” అని చంద్రబాబు అన్నారు.






# ప్రభుత్వ అరాచకాలను మరింతగా ఎండగడతాం:కేటీఆర్

**తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చేది భారాసనేనని, సభకు లక్షలాదిగా వచ్చిన ప్రజలు చెప్పిన సందేశం ఇదేనని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.**

హైదరాబాద్, ఏప్రిల్ 28, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణలో తిరిగి అధికారంలోకి వచ్చేది భారాసనేనని, రజతోత్సవ సభకు లక్షలాదిగా వచ్చిన ప్రజలు చెప్పిన సందేశం ఇదేనని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఎల్కతుర్తితో ఆదివారం జరిగిన భారాస రజతోత్సవ సభపై భారాస నాయకులు, కార్యకర్తలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. “భారాస రజతోత్సవ సభ విజయవంతం చేసిన తెలంగాణకు ధన్యవాదాలు. దేశ రాజకీయ చరిత్రలో అతి పెద్ద సభల్లో ఒకటిగా నిలిచిపోతుంది. నిన్నటి సమావేశం రజతోత్సవ కార్యక్రమాలకు ప్రారంభం మాత్రమే. ఇకపై తానే ముందుండి పోరాడతానని కేసీఆర్ ప్రకటించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలి. రాష్ట్ర ప్రభుత్వానికి తగిన సమయం ఇచ్చాం. ఇకపై ప్రతి అంశంపై ప్రభుత్వాన్ని వెంటాడుతాం. ప్రభుత్వ అరాచకాలను మరింతగా ఎండగడతాం” అని కేటీఆర్ అన్నారు.



# ఖజానా ఖాళీ చేసి మాపై నిందలా..?

## :కేసీఆర్ పై మండిపడ్డ సీఎం రేవంత్ రెడ్డి

**ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు.**

హైదరాబాద్, ఏప్రిల్ 28, (రిపబ్లిక్ న్యూస్): ఎల్కతుర్తిలో జరిగిన భారాస రజతోత్సవ సభపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కేసీఆర్ ప్రసంగంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆయన ప్రసంగం అక్కసుతో కూడుకున్నదని ఆరోపించారు. “కేసీఆర్ ఖజానాను ఖాళీ చేసి మాపై నిందలు వేస్తున్నారు. భారాసను నమ్మే స్థితిలో ప్రజలు లేరు. కేసీఆర్ అభద్రతాభావంతో మాట్లాడారు.

ఆయన ప్రసంగంలో స్పష్టత లేదు. రాహుల్గాంధీకి, నాకు గ్యాప్ ఉందనడం అవాస్తవం. రాహుల్కు, నాకు ఉన్న అనుబంధం ప్రపంచానికి చెప్పనవసరం లేదు. అవసరాలను బట్టి కేసీఆర్, మోదీ మాటలు మారుస్తున్నారు. దేశానికి ఇందిరాగాంధీ లాంటి ప్రధాని కావాలి” అని రేవంత్రెడ్డి అన్నారు. “ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లాలి. ఎమ్మెల్యేలు వెళ్తేనే.. ప్రజల్లోకి పథకాలు వెళ్తాయి. పార్టీలో ఓపికగా ఉంటే పదవులు వస్తాయి. ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే పార్టీ నేతలే నష్టపోతారు” అని రేవంత్ హెచ్చరించారు.



### జానారెడ్డితో సీఎం భేటీ..

జానారెడ్డితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. మావోయిస్టులతో చర్చల కోసం శాంతి కమిటీ ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా సీఎం అన్నారు. మావోయిస్టుల అంశంపై జానారెడ్డి, కే.కేశవరావు పార్టీలో చర్చిస్తారని తెలిపారు.

# విశాఖను ఆర్థిక రాజధానిగా, తిరుపతిని

## ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం:చంద్రబాబు

**అమరావతి అందరిదని.. రాష్ట్రానికి ఆత్మ వంటిదని సీఎం చంద్రబాబు తెలిపారు. కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు.**

అమరావతి, ఏప్రిల్ 28, (రిపబ్లిక్ న్యూస్): అమరావతి అందరిదని.. రాష్ట్రానికి ఆత్మ వంటిదని సీఎం చంద్రబాబు అన్నారు. కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్లో ఆయన మాట్లాడారు. రాజధాని పునఃనిర్మాణ పనులతో అభివృద్ధికి మళ్లీ ఊపిరి లభించిందన్నారు. సభకు తరలివచ్చే ప్రజలకు అసౌకర్యం కలగకూడదని చెప్పారు. అమరావతి రాజధాని తెలుగువారి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించే వ్యతిరేక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రాజధానిలో రైతులను భాగస్వాములను చేస్తున్నట్లు చంద్రబాబు వివరించారు.”ఎమ్మెల్యేలు, మంత్రులు బాధ్యత తీసుకొని వ్యతిరేక శక్తుల కుట్రలు తిప్పికొట్టాలి. త్వరలోనే 42 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుడతాం. రాయలసీమ స్టీల్ ప్లాంట్ నిర్మాణం కూడా చేపడతాం. విశాఖను ఆర్థిక రాజధానిగా, తిరుపతిని ఆధ్యాత్మిక నగరంగా తీర్చిదిద్దుతాం” అని చంద్రబాబు తెలిపారు.



# గ్రూప్-1 నియామకాలపై

## అప్పీలు దాఖలు చేసిన టీజీపీఎస్సీ

**తెలంగాణలో గ్రూప్-1 నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ అప్పీలు దాఖలు చేసింది.**

హైదరాబాద్, ఏప్రిల్ 28, (రిపబ్లిక్ న్యూస్): తెలంగాణలో గ్రూప్-1 నియామకాలను తాత్కాలికంగా నిలిపివేయాలంటూ హైకోర్టు సింగిల్ బెంచ్ ధర్మాసనం జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వులను సవాల్ చేస్తూ టీజీపీఎస్సీ అప్పీలు దాఖలు చేసింది. ఈ పిటిషన్పై సీజే ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టనుంది.



గ్రూప్ 1 నియామకాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయంటూ కొందరు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మెయిన్స్ పరీక్షల మూల్యాంకనం సరిగా చేయలేదని, పరీక్ష కేంద్రాల కేటాయింపులోనూ నిబంధనలు పాటించలేదని పిటిషనర్లు పేర్కొన్నారు. దీనిపై ఇటీవల విచారణ చేపట్టిన జస్టిస్ నామవరపు రాజేశ్వ-రరావు ధర్మాసనం.. నియామకాలు తాత్కాలికంగా నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ధ్రువపత్రాల పరిశీలన చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సీజే ధర్మాసనంలో టీజీపీఎస్సీ పిటిషన్ దాఖలు చేసింది. సీజే ధర్మాసనంలో అప్పీలు దాఖలు చేసినట్లు టీజీపీఎస్సీ తరపు న్యాయవాది సింగిల్ బెంచ్కు తెలిపారు. ఈ నేపథ్యంలో ఇదే అంశంపై ఇవాళ జరగాల్సిన విచారణను జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు బుధవారానికి వాయిదా వేశారు.

# పీఎస్ఆర్ ఆంజనేయులును

## కస్టడీలోకి తీసుకున్న సీఐడీ అధికారులు

**ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులును సీఐడీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. ఆదివారం ఆయనకు బీపీలో హెచ్చుతగ్గుల రావడంతో విచారణ జరగలేదు.**

అమరావతి, ఏప్రిల్ 28, (రిపబ్లిక్ న్యూస్): ఏపీ ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులును సీఐడీ అధికారులు కస్టడీలోకి తీసుకున్నారు. ఆదివారం ఆయనకు బీపీలో హెచ్చుతగ్గులు రావడంతో విచారణ జరగలేదు. ఈక్రమంలో సోమవారం ఆయన్ను అధికారులు విజయవాడ జిల్లా జైలు నుంచి కస్టడిలోకి తీసుకున్నారు.



అంతకుముందు ఆయనను నగరంలోని జీజీహెచ్కు తరలించారు. వైద్య పరీక్షల అనంతరం తాడిగడప సీఐడీ కార్యాలయంలో విచారిస్తున్నారు. ఆది, సోమ, మంగళవారాల్లో ఆయన్ను సీఐడీ కస్టడీకి అనుమతినిస్తూ ఇటీవల విజయవాడ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ముంబయికి చెందిన సినీనటి కాదంబరి జెత్వానీ, ఆమె కుటుంబ సభ్యులపై అక్రమ కేసు బనాయించి వేధించిన కేసులో పీఎస్ఆర్ ఆంజనేయులు అరెస్టయ్యారు. ప్రస్తుతం విజయవాడలోని జిల్లా జైల్లో రిమాండు ఖైదీగా ఉన్నారు.


printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్


## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1758 : అమెరికా రాజకీయవేత్త, 5వ అధ్యక్షుడు జేమ్స్ మన్రో జననం (మ. 1831).
- 1871 : నాటకకర్త, సంఘసంస్కర్త, ప్రథమాంధ్ర ప్రచురణకర్త కాళ్ళకూరి నారాయణరావు జననం (మ. 1927).
- 1897 : రచయిత, నటుడు, నాటకకర్త భమిడిపాటి కామేశ్వరరావు జననం (మ. 1958).
- 1916 : మహారాష్ట్రలోని పూణేలో బాలగంగాధర్ తిలక్ హోంరూల్ లీగ్ స్థాపించాడు.
- 1946 : ప్రముఖ రాజకీయవేత్త కోటగిరి విద్యాధరరావు జననం (మ. 2013).
- 1978 : ఆఫ్ఘనిస్థాన్ మొదటి అధ్యక్షుడు మహమ్మద్ దావుద్ ఖాన్ మరణం. (జ. 1909)
- 1987 : ప్రజాసేవకుడు, విద్యాసంపన్నుడు, పరిపాలనాదక్షుడు పైడి లక్ష్మయ్య మరణం (జ. 1904).
- 1992 : కన్నడ భాషకు చెందిన సాహిత్యవేత్త వినాయక కృష్ణ గోకాక్ మరణం (జ. 1909).
- 1998 : భారత క్రికెటర్ రమాకాంత్ దేశాయ్ మరణం (జ. 1939).
- 2001 : డెన్నిస్ టిటో, ప్రపంచంలో మొదటి అంతరిక్ష పర్యాటకుడుగా చరిత్రలో నిలిచాడు. (చిత్రంలో)


జేమ్స్ మన్రో



కాళ్ళకూరి నారాయణరావు


భమిడిపాటి కామేశ్వరరావు



బాలగంగాధర్ తిలక్



కోటగిరి విద్యాధరరావు


మహమ్మద్ దావుద్ ఖాన్


పైడి లక్ష్మయ్య


వినాయక కృష్ణ గోకాక్


రమాకాంత్ దేశాయ్


డెన్నిస్ టిటో

# ఏకైక హిట్ మూవీ.. 'ఎల్ 2' బడ్జెట్ వెల్లడించిన నిర్మాతలు

**మార్చి నెలలో మలయాళంలో విడుదలైన సినిమాల్లో 'ఎల్2: ఎంపురాన్' మాత్రమే విజయం సాధించిందని కేరళ చలన చిత్ర నిర్మాతల సంఘం తాజాగా వెల్లడించింది.**



మోహన్లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో వచ్చిన యాక్షన్ థ్రిల్లర్ 'లూసిఫర్'. దానికి కొనసాగింపుగా రూపొందిన తాజా చిత్రమే 'ఎల్2: ఎంపురాన్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం మంచి ఆదరణ సొంతం చేసుకుంది. ఈ సినిమా బడ్జెట్ను ప్రచారాల్లో కూడా ఎక్కడా చెప్పలేదు. తాజాగా నిర్మాత దీని బడ్జెట్ను వెల్లడించారు. రూ.175 కోట్లతో దీన్ని తెరకెక్కించినట్లు తెలిపారు. మలయాళం ఇండస్ట్రీలోనే అత్యధిక బడ్జెట్తో రూపొందించిన చిత్రం ఇదేనని పేర్కొన్నారు. 2025లో మలయాళ ఇండస్ట్రీ ఆశించిన విజయాలను అందుకోలేకపోయింది. తొలి మూడు నెలలు విడుదలైన వాటిల్లో అధిక శాతం సినిమాలు పరాజయం పాలయ్యాయి. మార్చిలోనూ మొత్తం 15 సినిమాలు విడుదల కాగా.. 14 సినిమాలు నిరాశను మిగిల్చాయని నిర్మాత సంఘం పేర్కొంది. 'ఎల్ 2: ఎంపురాన్' మాత్రమే విజయాన్ని సాధించిందని కేరళ చలన చిత్ర నిర్మాతల సంఘం తాజాగా వెల్లడించింది. వసూళ్లపరంగానూ మలయాళ ఇండస్ట్రీలో ఈ చిత్రం రికార్డును నెలకొల్పిందని తెలిపింది. మార్చి 27న 'ఎల్2: ఎంపురాన్' తెలుగు, మలయాళం, కన్నడ, తమిళ్లో ప్రేక్షకుల ముందుకువచ్చింది. నాలుగున్నర రోజుల్లోనే రూ.200 కోట్ల క్లబ్లో చేరిన ఈ సినిమా మొత్తం రూ.262 కోట్లకు పైగానే వసూలు చేసింది. ప్రస్తుతం 'జియో హాట్స్టార్' వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.

# 'రెట్రో'లో రొమాన్స్‌కే ప్రాధాన్యం... ఎందుకంటే: కార్తీక్ సుబ్బరాజు

**'రెట్రో' స్వచ్ఛమైన ప్రేమకథగా రూపొందించామని దర్శకుడు కార్తీక్ సుబ్బరాజు అన్నారు.**



సూర్య హీరోగా కార్తిక్ సుబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'రెట్రో'. మే 1న అది ప్రేక్షకుల ముందుకురానుంది. సూర్య సరసన పూజా హెగ్డే నటించిన ఈ సినిమాలో రొమాన్స్కే ఎక్కువ ప్రాధాన్యమిచ్చినట్లు దర్శకుడు వివరించారు. ఈ చిత్రం ప్రచారంలో భాగంగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ఇందులో వింటేజ్ సూర్యను చూస్తారన్నారు. "నా గత చిత్రాలు 'పిజ్జా', 'జిగర్తాండ'లతో పోలిస్తే 'రెట్రో' పూర్తి భిన్నంగా ఉంటుంది. నేను క్రైమ్, థ్రిల్లర్, డార్క్ కామెడీ చిత్రాలు చేయాలని ప్రేక్షకులు ఆశిస్తారు. కానీ 'రెట్రో' స్వచ్ఛమైన ప్రేమకథ. ప్రేక్షకుల హృదయాల్లో ఎప్పటికీ నిలిచిపోతుంది. ఇందులో రొమాన్స్కు ప్రాధాన్యమిచ్చాం. హీరో, హీరోయిన్ల మధ్య అనుబంధాన్ని గొప్పగా చూపించాం. గ్యాంగ్స్టర్ అయిన హీరో ప్రేమ కోసం తన హింసాత్మక ధోరణిని ఎలా విడిచిపెడతాడు, హీరోయిన్ను కలిశాక అతడి జీవితంలో ఎదురైన సంఘటనలతో హృదయాన్ని హత్తుకునేలా దీన్ని తెరకెక్కించాం. ఈ జానర్లో సినిమా చేయడం సవాలుగా అనిపించింది. రొమాంటిక్ సన్నివేశాలు ఈ కథకు మరింత అందాన్నిచ్చాయి. హీరో, హీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ, వారి మౌనం, ఒకరినొకరు చూసుకునే విధానం, ఇలాంటి చిన్న చిన్న విషయాలు గొప్ప ప్రభావాన్ని చూపుతాయి. రెట్రో.. కలకాలం నిలిచిపోయే ప్రేమకథ" అని దర్శకుడు వివరించారు. భారీ అంచనాల మధ్య విడుదలైన సూర్య 'కంగువా' ఆయనకు చేదు అనుభవాన్ని మిగిల్చింది. దీంతో ఇప్పుడు అభిమానుల ఆశలన్నీ 'రెట్రో' పైనే ఉన్నాయి. రొమాంటిక్ యాక్షన్ ఫిల్మ్ గా ఇది సిద్ధమైంది. 2 గంటల 48 నిమిషాల రన్టైమ్తో రానుంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి.

రిపబ్లిక్ సినిమా CINEMA

# 'కేసరి చాప్టర్ 2' వివాదానికి ఫుల్స్టాప్.. పోస్ట్ పెట్టిన యూట్యూబర్

**'కేసరి: చాప్టర్2'లో ఒక డైలాగుపై యూట్యూబర్ యాహ్యా బూట్వాలా ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వివాదం ముగిసినట్లు ఆయన పోస్ట్ పెట్టారు.**



అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన 'కేసరి చాప్టర్ 2'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలు అందుకుంది. తాజాగా ఈ సినిమాలోని డైలాగులపై యూట్యూబర్ యాహ్యా బూట్వాలా ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విషయంపై చిత్ర నిర్మాతలు తనతో మాట్లాడినట్లు యూట్యూబర్ పేర్కొన్నారు. "కేసరి చాప్టర్ 2' చిత్ర నిర్మాతలు నాతో చర్చించారు. సమస్యను సామరస్యంగా పరిష్కరించుకున్నాం. ఈ విషయంలో మీ అందరి మద్దతు మర్చిపోలేను. మీ వల్లే ఇది సాధ్యమైంది" అని పోస్ట్ పెట్టారు. ఈ సినిమాలో అక్షయ్ కుమార్, అనన్య పాండేలకు మధ్య జరిగే సంభాషణల్లో తన కవితను ఉపయోగించారని యాహ్యా బూట్వాలా ఆరోపించారు. జలియన్వాలాబాగ్ మారణకాండపై తాను గతంలో రాసుకున్న కవితలోని కొన్ని లైన్లను తన అనుమతి లేకుండా కాపీ చేశారని పేర్కొన్నారు. ఈ విషయంపై తనకు న్యాయం చేయాలని కోరుతూ పోస్ట్ పెట్టారు. దానికి చిత్రబృందాన్ని ట్యాగ్ చేశారు. తాను గతంలో రాసిన కవితను, 'కేసరి 2' డైలాగును పోలుస్తూ వీడియో విడుదల చేశారు. ఇది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీనిపై చిత్రబృందం స్పందించడంతో ఫుల్ స్టాప్ పడింది.

ప్రజా రిపబ్లిక్ దినపత్రిక
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

రిపబ్లిక్ స్పోర్ట్స్

# ఎవరికీ సాధ్యం కాని రికార్డు.. ఐపీఎల్ చరిత్రలో తొలి జట్టుగా ఆర్సీబీ

**ఆర్సీబీ దూకుడు కొనసాగుతోంది. ఏడు మ్యాచుల్లో గెలిచి పాయింట్ల పట్టికలో టాప్లోకి చేరింది. ప్లేఆఫ్స్కు మరింత చేరువైన ఆ జట్టు ఓ ఘనతను తన ఖాతాలో వేసుకుంది.**



ఐపీఎల్ 2025 సీజన్లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుఅదరగొట్టేస్తోంది. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్ను చిత్తు చేసిన ఆర్సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలోకి దూసుకెళ్లింది. విరాట్ కోహ్లి, కృనాల్ పాండ్య కీలక ఇన్నింగ్స్ ఢిల్లీని అలవోకగా ఓడించింది. ఈక్రమంలో ఆర్సీబీ ఓ అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఐపీఎల్ చరిత్రలో ఇప్పటివరకు ఏ జట్టు కూడా ఇలాంటి రికార్డును సాధించలేదు. ప్రస్తుత ఐపీఎల్ సీజన్లో ఆర్సీబీ 10 మ్యాచులు ఆడింది. ఇందులో ఏడు విజయాలు, మూడు ఓటములు ఉన్నాయి. ఈ ఏడింట్లో ఆరు విజయాలు బయటి వేదికల్లోనే సాధించడం విశేషం. ఇలా ఐపీఎల్ చరిత్రలో ప్రత్యర్థి మైదానం వేదికగా జరిగిన మ్యాచుల్లో ఆరు విజయాలు నమోదుచేయడం ఇదే తొలిసారి. మరే జట్టూ ఇంతవరకు ఇలాంటి ఫీట్ను సాధించలేదు. ప్రస్తుతం ఆర్సీబీ 14 పాయింట్లతో తొలి స్థానంలో ఉంది. మిగిలిన నాలుగు మ్యాచుల్లో కనీసం ఒక్కటి గెలిచినా ప్లేఆఫ్స్ బెర్తు దాదాపు ఖాయమవుతుంది.

### బౌలర్లకే ఈ క్రెడిట్: రజత్ పటీదార్

"ఇది జట్టు ప్రదర్శన. ప్రణాళికల ప్రకారమే బౌలింగ్ చేయగలిగాం. ఇంతకుముందే ఓ మాట చెప్పా. వేదికల గురించి ఆలోచించే టీమ్ మాది కాదు. ఎక్కడైనా సరే నాణ్యమైన క్రికెట్ ఆడేందుకు ప్రయత్నిస్తాం. లక్ష్య ఛేదనకు దిగినప్పుడే పిచ్ గురించి ఓ అవగాహన వచ్చింది. తొలుత మా బౌలింగ్ ఎలా ఉండాలి? ఆ తర్వాత టార్గెట్ ఛేదన ఎలా చేయాలి? అనే దానిపై పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాం. విజయం సాధించాక టాప్లోకి వెళ్లడం ఆనందంగా ఉంది. మా జట్టులో చాలా గొప్ప ప్లేయర్లు ఉన్నారు. వారి నుంచి నేర్చుకొనే అవకాశం రావడం అద్భుతం" అని ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటీదార్ వ్యాఖ్యానించాడు. భువనేశ్వర్ (3/33), హేజిల్వుడ్ (2/36) దెబ్బకు ఢిల్లీ 20 ఓవర్లలో 162 పరుగులకే పరిమితమైంది. అనంతరం లక్ష్య ఛేదనలో బెంగళూరు 18.3 ఓవర్లలోనే నాలుగు వికెట్లను మాత్రమే కోల్పోయి విజయం సాధించింది. కృనాల్ పాండ్య (73లి), విరాట్ (51) హాఫ్ సెంచరీలు సాధించారు.

## ఇంటి చిట్కాలు

# రెండు నిమిషాల్లోనే ఇంట్లో చేసుకోగల కొన్ని డ్రింక్స్‌తో బెల్లీ ఫ్యాట్ కరిగించవచ్చు, రెగ్యులర్‌గా తాగితే వేలాడే పొట్ట మాయం

**బెల్లీ ఫ్యాట్‌ను కరిగించడం పెద్ద సవాల్‌గా మారింది. పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు కరగడానికి చాలా సమయం పడుతుంది. శరీరంలో మిగతా భాగాల కన్నా నెమ్మదిగా కరుగుతుంది. బెల్లీ ఫ్యాట్‌ని కరిగించుకోవాలంటే చాలా కష్టపడాల్సి ఉంటుంది.**

ప్రస్తుత బిజీ లైఫ్‌స్టైల్, అనారోగ్యకర ఆహారపు అలవాట్లతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇందులో బెల్లీ ఫ్యాట్ ముఖ్యమైన సమస్యగా మారింది. చాలా మంది బెల్లీ ఫ్యాట్‌తో బాధపడుతున్నారు. ఒక వ్యక్తి ఆహారపు అలవాట్లు అతని ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయి. ఆహారపు అలవాట్ల కారణంగా అధిక బరువు, బెల్లీ ఫ్యాట్ సమస్యలతో బాధపడుతున్నారు. బెల్లీ ఫ్యాట్ అంటే బొడ్డు చుట్టూ కొవ్వు పేరుకుపోవడం. దీంతో ఈ పొట్ట గుండ్రటి ఆకారంలో కనిపిస్తుంది. బెల్లీ ఫ్యాట్ కారణంగా గుండె, బీపీ, షుగర్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఇక, బెల్లీ ఫ్యాట్‌ను కరిగించడం పెద్ద సవాల్‌గా మారింది. పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు కరగడానికి చాలా సమయం పడుతుంది. శరీరంలో మిగతా భాగాల కన్నా నెమ్మదిగా కరుగుతుంది. బెల్లీ ఫ్యాట్‌ని కరిగించుకోవాలంటే చాలా కష్టపడాల్సి ఉంటుంది. అయితే, ఇంట్లో తయారు చేసుకునే కొన్ని డ్రింక్స్ ద్వారా ఈ సమస్యను పరిష్కరించుకోవచ్చని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. ఇవి తయారు చేసుకోవడానికి ఎక్కువ సమయం కూడా పట్టదు. రెండు నిమిషాల్లోనే ఈ డ్రింక్స్ తయారు చేసుకోవచ్చు. బెల్లీ ఫ్యాట్ కరిగించే ఆ డ్రింక్స్ ఏంటో తెలుసుకుందాం.





### ఆపిల్ సైడర్ వెనిగర్ డ్రింక్



బరువు తగ్గడానికి ఆపిల్ సైడర్ వెనిగర్ చాలా ప్రభావవంతంగా ఉంటుంది. ఇందుకోసం ఒక గ్లాసు నీటిలో 1 టీస్పూన్ ఆపిల్ సైడర్ వెనిగర్ కలపండి. దానికి అర టీస్పూన్ తేనె కలపండి. వ్యాయామానికి ముందు ఉదయం దీన్ని తాగాలి. ఇది ఆకలిని నియంత్రిస్తుంది. బెల్లీ ఫ్యాట్‌ని బర్న్ చేసే ప్రక్రియను వేగవంతం చేస్తుంది.

### నిమ్మకాయ, అల్లం డీటాక్స్ డ్రింక్



నిమ్మకాయ, అల్లం మిశ్రమం బెల్లీ ఫ్యాట్‌ను వేగంగా కరిగించడంలో సాయపడుతుంది. అల్లం జీవక్రియను పెంచుతుంది. కొవ్వును బర్న్ చేయడానికి సాయపడుతుంది. నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొవ్వును వేగంగా బర్న్ చేస్తాయి. ఇందుకోసం ఒక గ్లాస్ గోరువెచ్చని నీటిలో సగం నిమ్మకాయ రసాన్ని పిండండి. దానికి ఒక టీ స్పూన్ తురిమిన అల్లాన్ని జోడించాలి. ఈ డ్రింక్‌ను ఉదయాన్నే ఖాళీ కడుపుతో తాగాలి. ఈ డ్రింక్ జీవక్రియను వేగవంతం చేస్తుంది. శరీరం నుంచి టాక్సిన్లను బయటకు పంపుతుంది.

### గ్రీన్ టీ



గ్రీన్ టీలో కాటెచిన్ యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొవ్వును బర్న్‌ని చేయడంలో ప్రోత్సహిస్తాయి. ఇందుకోసం 1 కప్పు వేడి నీటిలో గ్రీన్ టీ బ్యాగ్ ఉంచండి. 2-3 నిమిషాలు అలాగే ఉంచి, ఆ తర్వాత తాగండి. ఈ డ్రింక్ జీవక్రియను వేగవంతం చేస్తుంది. శరీరానికి కావాల్సిన శక్తిని అందిస్తుంది. గ్రీన్ టీ రెగ్యులర్‌గా తాగడం వల్ల బెల్లీ ఫ్యాట్ కరిగిపోతుందని నిపుణులు చెబుతున్నారు.

### కీరదోస - పుదీనా డీటాక్స్ డ్రింక్



దోసకాయలో 95% నీరు ఉంటుంది. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. పుదీనా జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. దీంతో పాటు జీవక్రియను పెంచుతుంది. ఈ పానీయం శరీర వేడిని చల్లబరుస్తుంది. కేలరీలను బర్న్ చేయడంలో సహాయపడుతుంది. ఇందుకోసం కీర దోసకాయను సన్నని ముక్కలుగా కట్ చేసుకోండి. దానికి తాజా పుదీనా ఆకులు, 1 గ్లాసు నీరు కలిపి బ్లెండ్ చేయండి. రాత్రంతా ఫ్రిజ్‌లో ఉంచి, ఉదయం తాగండి. ఈ పానీయం శరీరాన్ని డీటాక్స్ చేసి జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది.

### నిమ్మరసం, పసుపు డ్రింక్



పసుపు, నిమ్మకాయ మిశ్రమం మంటను తగ్గిస్తుంది. అంటే శరీరంలో ఇన్ఫ్లమేషన్ లెవల్స్‌ని తగ్గిస్తుంది. అంతేకాకుండా బరువు తగ్గడానికి సాయపడుతుంది. ఒక గ్లాసు గోరువెచ్చని నీటిలో అర టీస్పూన్ పసుపు, అర నిమ్మకాయ రసం కలపండి. ఉదయం ఖాళీ కడుపుతో తాగండి. ఈ పానీయం శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వును తగ్గిస్తుంది. క్రమం తప్పకుండా వ్యాయామంతో పాటు ఈ డ్రింక్ తాగడం వల్ల బెల్లీ ఫ్యాట్ తగ్గడంతో పాటు బరువు తగ్గవచ్చని నిపుణులు అంటున్నారు.

**గమనిక**

ఇది సాధారణ సమాచారం కోసం మాత్రమే. ఇది ఏ విధంగానూ ఏ మెడిసిన్ లేదా చికిత్సకు ప్రత్యామ్నాయం కాదు. వీటిని పాటించేముందు మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ మీ వైద్యుడిని సంప్రదించండి. తెలుగు సమయం ఈ విషయాల్ని ధృవీకరించడం లేదు. ఖచ్చితత్వం, ప్రభావానికి తెలుగు సమయం బాధ్యత వహించదు.